ప్రజాశక్తి
సోమవారం 29 డిసెంబర్ 2025 5 అనంతపురం

1 నుంచి తిరుపతి-కదిరిదేవరపల్లి రైలు వేళల మార్పు

ప్రజాశక్తి-రాయదుర్గం

వచ్చేనెల 1వతేదీ నుంచి తిరుపతి-కదిరిదేవరపల్లి నడుమ ప్రయాణించే ప్యాసింజర్ రైలు 57405/ 57406 వేళల్లో మార్పులు చేయనున్నట్లు రైల్వే అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రైన్ నెంబర్ 57406 రైలు జనవరి మొదటి తేదీ నుంచి రోజూ మధ్యాహ్నం 2-20 గంటలకు కదిరిదేవరపల్లి నుంచి బయలుదేరి 2-34కు కళ్యాణదుర్గం, 3-26కు రాయదుర్గం, 3-55కు సోమలాపురం, 4-18 గంటలకు ఓబులాపురం, 4-48 గంటలకు బళ్లారి రైల్వేస్టేషన్ చేరుతుందన్నారు. తిరుపతి నుంచి కదిరి దేవరపల్లి బయలుదేరు ట్రైన్ నెంబర్ 57405 రైలు రోజూ ఉదయం 9:30కు బళ్లారి, 9-59 గంటలకు ఓబులాపురం, 10-19కి సోమలాపురం, 10-39 గంటలకు రాయదుర్గం జంక్షన్, 10- 54 ఆవులదట్ల, 11- 19కు కళ్యాణదుర్గం స్టేషన్ చేరుతుందన్నారు. రైలు వేళల మార్పును ప్రయాణికులు గమనించాలని కోరారు.

పొలాల్లోనే నిల్వ ఉంచిన వరి ధాన్యం

దగా పడుతున్న వరి రైతు

నామమాత్రంగా కొనుగోలు కేంద్రాలు
దళారులను ఆశ్రయిస్తున్న అన్నదాతలు

ప్రజాశక్తి - బొమ్మనహాల్

వరి రైతులను ప్రభుత్వం నిలువునా మోసం చేస్తోంది. రైతుల నుంచి వరిధాన్యం కొనుగోలు చేసి వారి ఖాతాల్లో డబ్బు జమ చేస్తామన్న పాలకుల మాటలు నీటిమూటలయ్యాయి. పాలకులు బూటకపు హామీతో బొమ్మనహాల్ మండలంలోని వరి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరి పంట పండించిన రైతుల కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతు ఖాతాల్లోకి డబ్బులు వేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పౌర సరఫరాశాఖామంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. అయితే పాలకుల హామీలు బొమ్మనహాల్ మండలంలో అమలు కాలేదు. మండలంలో 20వేల ఎకరాల ఆయకట్టు భూములో వరిపంట సాగు చేశారు. వీటి ద్వారా దాదాపు 40లక్షల టన్నుల వరిధాన్యం దిగుబడి వస్తే ప్రభుత్వం కేవలం 20 లక్షల టన్నుల వరిధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసింది. దీంతో మిగిలిన రైతుల పరిస్థితి ఏమిటని బాధిత రైతులు ప్రశ్నిస్తున్నారు. అయితే కొనుగోలు కేంద్రాల నుండి ఒక క్వింటాలకు బ్యాగుకోసం అని ఐదు కేజీలు అదనంగా తీసుకుంటున్నారు. లారీ పాసింగ్ చేయాలంటే ఒక రేటు, డ్రైవర్ మామూలు ఇవన్నీ చెల్లించుకోలేక చిన్న, సన్న కారు రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉంగే కౌలు రైతులు పండించిన వరి ధాన్యానికి క్రాప్ బుకింగ్ లేని కారణంగా ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. దీంతో కౌలు రైతులు తమ ధాన్యాన్ని కల్లాల్లోనే ఉంచుకుని దళారుల కోసం ఎదురు చూస్తున్నారు. పండించిన పంటను అమ్ముకొనడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం నిలువ ఉంచుకోవటానికి గిడ్డంగులు లేక నానా పాట్లు పడుతున్నారు. వరిధాన్యాన్ని పొలాల్లోనే ఉంచుకుని రాత్రి పగలు కాపలాకాస్తున్నారు. ప్రస్తుతం ఉన్న సోనామసూరి క్వింటా రూ.2,350తో ప్రభుత్వం కొనుగోలు చేస్తుంటే దళారులు మాత్రం రూ.2,200మాత్రమే ధర చెబుతున్నారు అయితే ప్రభుత్వం ఇచ్చే ధరకు దళారులకు 150 రూపాయలు తేడా ఉంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల వద్ద దాళా, లారీ పాసింగ్, డ్రైవర్ మామూలు అంటూ అదనంగా ఖర్చు అవుతున్నాయని దీంతో దళారులకే ధాన్యం విక్రయిస్తున్నామని పలువురు వరిరైతులు చెబుతున్నారు. చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుంచి ఎలాంటి ఉపయోగం లేదని వారు విమర్శిస్తున్నారు. రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం కేవలం కంటితుడుపు చర్యగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని వాటి ద్వారా కూడా రైతులకు నష్టం తెచ్చేలా వ్యవహరిస్తోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రెవెన్యూ రికార్డులన్నీ డిజిటలైజేషన్

పంటలకు మార్కెటింగ్ సౌకర్యం పెంపుపై దృష్టి
పిజిఆర్ఎస్‌ల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత
కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రెవెన్యూ రికార్డులన్నింటినీ ఐదు మాసాల్లోపు డిజిటలైజేషన్ పూర్తి చేస్తామని, పిజిఆర్ఎస్ పరిష్కారమే అత్యంత ప్రాధాన్యత అంశంగా ఉంటుందని జిల్లా కలెక్టరు ఓ.ఆనంద్ పేర్కొన్నారు. ఓ.ఆనంద్ కలెక్టరుగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి జిల్లా అభివృద్ధితోపాటు పరిపాలనా పరంగా తీసుకొస్తున్న మార్పుల గురించి ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన వివరించారు.

ప్రశ్న : సిఎం చంద్రబాబునాయుడు జిల్లా కలెక్టర్ల సమావేశం ఇటీవల నిర్వహించారు. అందులో రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్ అంశం ప్రత్యేకంగా చర్చకు వచ్చింది. ఈ అంశాన్ని కొద్దిగా వివరిస్తారా ?

కలెక్టర్: అవును రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్ అంశం చర్చకు వచ్చింది. అదేమిటంటే అడంగల్, ఆర్‌హెచ్, 1బి, ఇలా వేరువేరు పేర్లతో రికార్డులుంటాయి. ఇవి ఒక్కో రికార్డు ఒక్కో కార్యాలయంలో ఉంటుంది. కొన్ని తహశీల్దారు కార్యాలయంలో ఉండగా, కొన్ని ఆర్డీవో, మరికొన్ని కలెక్టరు కార్యాలయాల్లో ఉంటాయి. వీటిని పరిశీలించాలంటే ఇప్పుడు చాలా సమయం పడుతోంది. వీటన్నింటిని డిజిటల్ రూపంలో అంటే స్కాన్డు రూపంలో ఒక వద్దనే ఉంచడం జరుగుతుంది. సర్వే నంబరు వారీగా డిజిటల్ లైబ్రరీ ఒకటి రూపొందించి ఒక వెబ్‌సైట్‌లో ఉంచడం జరుగుతుంది. అవసరమైనప్పుడు ఆ సర్వేనంబరుకు సంబంధించి వివరాలన్నీ ఒకే వద్ద చూసేందుకు వీలుంటుంది. గతంలో నేను నెల్లూరులో పనిచేసే సమయంలో ఈ విధానం ఆరంభించాను. అక్కడ ఒక కొలిక్కి వచ్చింది. బదిలీపై ఇక్కడికి వచ్చాక ఇక్కడ కూడా ఆరంభించడం జరిగింది. రాబోయే ఐదు మాసాల్లోపు డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ప్రస్తుతానికి ఇది అధికారుల లాగిన్ వరకు ఉంటుంది. తదుపరి సామాన్యులకు కూడా అందుబాటులో ఉండే విధంగా ఉంచాలన్నది ఉద్దేశ్యం. సాధ్యమైనంత త్వరగా పక్కాగా దీన్ని రూపొందించే విధంగా చర్యలు చేపడుతున్నాం.

ప్రశ్న : రెవెన్యూ అంశమంటేనే ఇప్పుడు నిత్యం ఆరోపణలతో ఉంటున్నాయి. ఇందులో కొంత మంది బయటి వ్యక్తులుంటుండగా, మరికొంత మంది రెవెన్యూ సిబ్బంది ప్రమేయమూ ఉంటోంది. వీటి కట్టడికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?

కలెక్టర్ : రెవెన్యూ పరమైన అంశాల్లోనే ఎక్కువగా తమకు విజ్ఞాపనలూ వస్తున్నాయి. ఆరోపణలు ఉంటున్నాయి. పక్కాగా ఆధారాలతో అధికారులు సిబ్బంది తప్పుచేసినట్టు తేలితే వాటిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాము. ఇప్పటికే కింది స్థాయి సిబ్బంది కొంత మందిపై వేటు వేశాము. ఇంకా ఎక్కడైనా ఇలాంటి పరిస్థితి ఉంటే ఉపేక్షించేది లేదు.

ప్రశ్న : పిజిఆర్ఎస్‌లో వస్తున్న ప్రధాన సమస్యలేమిటీ ? వాటి పరిష్కారానికి ఏ రకమైన చర్యలు తీసుకుంటున్నారు ?

కలెక్టర్ : ప్రభుత్వం కూడా అత్యంత ప్రాధాన్యత పిజిఆర్ఎస్‌కి ఇస్తోంది. గతంలోలాగా కాకుండా ఇప్పుడు వాటి పరిష్కారంతోపాటు అర్జీదారుడు సంతృప్తి చెందాడా లేదా అన్నది కూడా పరిశీలించడం జరుగుతోంది. దీనికి ఆడిట్ కూడా జరుగుతోంది. ఈ ఆడిట్‌లో సంతృప్తి చెందలేదని తెలిస్తే తిరిగి ఫాలోప్ చేసి పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. కలెక్టరేట్‌లోనే కాకుండా మండల స్థాయిలోనూ సమస్యలను విజ్ఞాపనలు చేయాలని ప్రజలకు సూచిస్తున్నాం. ఎక్కడ చేసినా పరిష్కారం ఒకే విధంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న : 22 ఎ, చుక్కల భూములు చాలాకాలం పరిష్కారం కాకుండా ఉంటున్నాయి. వీటి పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు. ?

కలెక్టర్: అవును చాలా ఉన్నాయి. అయితే తాను కలెక్టరుగా బాధ్యతలు చేపట్టాక నాలుగైదు రోజులు ప్రత్యేకంగా డ్రైవ్ పెట్టి 22ఎకు సంబంధించి 1059 వాటిని క్లియర్ చేశాం. ఇంకా ఉన్నాయి. కంటిన్యూగా డ్రైవ్ చేయడానికి ఇతర రెవెన్యూ సేవలకు ఇబ్బంది కలుగుతుందని భావించి నెలలో కొన్ని రోజులు ప్రత్యేకంగా అనుకుని ఆ రోజుల్లో క్లియర్ చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇక చుక్కల భూములది ఇదే రకంగా క్లియర్ చేయాలని నిర్ణయించుకున్నాం. రాబోయే రోజుల్లో వీటిని క్లియర్ చేసే విధంగా చర్యలు చేపడతాం.

ప్రశ్న : జిల్లా వ్యవసాయాధారితం. ఇక్కడ పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేక రైతులు నష్టపోతున్నారు. ఈ ఏడాది అరటి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇటువంటి వాటికి ఏ రకమైన పరిష్కారాలు చూపనున్నారు ?

కలెక్టర్ : జిల్లాలో తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువతోపాటు, హంద్రీనీవా ద్వారా నీటి లభ్యత పెరిగింది. ఈ క్రమంలోనే జిల్లాలో పంటల సరళీలోనూ మార్పులొస్తున్నాయి. రైతులు ఉద్యానవన పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో అనేక రకాల ఉద్యానవన పంటల సాగు జరుగుతోంది. అయితే ఈ పండిన పంటలకు తగ్గట్టు మార్కెటింగ్ సౌకర్యం ఇంకా పెరగాల్సి ఉంది. మార్కెటింగు సౌకర్యం పెంపుదలపై దృష్టి సారించాం. దేశంలోని వివిధ ప్రాంతాలతోపాటు ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకున్న అవకాశాలను పరిశీలిస్తున్నాం. ఔత్సాహికులు ముందుకొస్తే ప్రభుత్వం వైపు నుంచి తోడ్పాటు అందిస్తాం.

ప్రశ్న : విజన్ 2047లో భాగంగా అనంతపురం జిల్లాలో ఐదేళ్ల ప్రగతిలో జిల్లా ఏ రకంగా ముందుకు సాగుతోంది ?

కలెక్టర్: ఐదేళ్ల ప్రగతి ఏరకంగా ఉండాలన్నది ఆయా శాఖలకు లక్ష్యాలను కేటాయించడం జరిగింది. ఆ లక్ష్యాలు నెల వారీగా ఏ మేరకు ఆ శాఖలు చేరుకున్నాయన్నది ప్రభుత్వం కీ ఇండికేటర్స్ ద్వారా లెక్కగడుతోంది. దాన్ని బట్టి ర్యాంకు కూడా ఇస్తోంది. కాబట్టి ఎప్పటికప్పుడు ఆ లక్ష్యం చేరుకునే విధంగా చర్యలు చేపడుతున్నాం.

ప్రశ్న : కేంద్ర నిధుల వినియోగంలో వెనకబడ్డడు కలెక్టర్ల సదస్సులో చర్చకు వచ్చింది. ఇందులో జిల్లా పరిస్థితి ఏమిటి ?

కలెక్టరు : కేంద్ర నిధుల వినియోగంలో జిల్లా మధ్యస్థంగా ఉంది. రాష్ట్రంలో 13వ స్థానంలో ఉన్నాం. ఇందులో ఎక్కడ వెనకబడ్డామన్నది పున: పరిశీలించుకుని రాబోయే రోజుల్లో పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునే విధంగా చర్యలు చేపడతాం.

ప్రశ్న : జిల్లాలో ప్రత్యేకంగా మీరు దృష్టి సారించిన అంశాలేమైనా ఉన్నాయా.?

కలెక్టర్ : ప్రత్యేకంగా దృష్టి సారించిన అంశాలున్నాయి. అయితే ఒక మార్పు చేపట్టడం ద్వారా ఎక్కువ మంది ప్రజానీకానికి మేలు జరిగే విధంగా ఉండాలన్నదే నా ఉద్దేశ్యం. అటువంటి అంశాలపై దృష్టి పెట్టడం జరిగింది. ఇప్పటి వరకు 20 అంశాలు దృష్టిలో ఉన్నాయి. ఇందులో ఎన్ని సఫలీకృతమవుతాయో చూడాలి.అవి ఒక గాడిలోకి వచ్చాక తెలియజేస్తాను.

న్యూఇయర్ గ్రీటింగ్‌ను ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకురాళ్లు

న్యూఇయర్ గ్రీటింగ్ కార్డుల ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర గ్రీటింగ్ కార్డులను ఆదివారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి చంద్రిక, జిల్లా కోశాధికారి అశ్విని మాట్లాడుతూ మహిళలపై పెరుగుతున్న హింస, మైక్రో ఫైనాన్స్ దోపిడీ, గంజాయి, ధరల పెరుగుదలతో మహిళలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులపై ఐద్వా నిరంతర ం పోరాడుతుందని తెలిపారు. మహిళల హక్కులు, సమానత్వం, భద్రత కోసం 2026లో ఉద్యమాలను మరింత విస్తృతంగా చేపడతామని స్పష్టం చేశారు. ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తూ మహిళలకు న్యాయం జరిగే వరకూ ఐద్వా రాజీలేని పోరాటాలు కొనసాగిస్తుందని తెలిపారు. నూతన సంవత్సరం మహిళలకు భద్రత కలిగిన జీవితం అందించే సంవత్సరంగా మారాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర అధ్యక్షురాలు శంషాద్, కోశాధికారి గీత, నగర కార్యవర్గ సభ్యులు శైలజ, పద్మావతి, సీనియర్ నాయకులు అరుణ, లక్ష్మీదేవి, సబ్యులు తదితరులు పాల్గొన్నారు.

కురుబ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సవితమ్మ

కురుబ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు అరవేటి పద్మావతి, ప్రధాన కార్యదర్శి మంగళకుంట నాగరాజు, కోశాధికారి అట్టే ఓబులేసు ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని కనకదాస కళ్యాణ మండపంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంత్రి సవితమ్మ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం ఎంపీ బికె పార్థసారథి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్, కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోరంపల్లి ఆంజనేయులు, జిల్లా అధ్యక్షులు తుప్పటీశ్వరి, ప్రముఖ డాక్టర్ మహేష్, యోగి వేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ పార్వతి, కురువ కార్పొరేషన్ డైరెక్టర్లు శ్రీనివాసులు, కృష్ణమూర్తి, ఆవుల కృష్ణ, కాటమయ్య, తదితరులు పాల్గొన్నారు.

సిఐ శ్రీకాంత్‌ను పరామర్శించి మంత్రి సవిత

సిఐటితో మాట్లాడుతున్న మంత్రి సవితమ్మ

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురంలో నాలుగు రోజుల క్రితం అయ్యప్ప కేఫ్ వద్ద మద్యం తాగి నలుగురు స్నేహితుల మధ్య గొడవలో నిందితుడైన అజయ్ దాడిలో గాయపడిన 2వ పట్టణ సిఐ శ్రీకాంత్‌యాదవ్‌ను బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత పరామర్శించారు. ఆదివారం రోడ్లు భవనాల శాఖ అతిథిగృహంలో సిఐ శ్రీకాంత్ మంత్రి పరామర్శించి దాడి ఘనటపై ఆరాతీశారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విధుల్లో చేరిన సిఐను అభినందించారు. నిందితులకు శిక్షపడేలా ప్రభుత్వం పోలీస్ శాఖ ద్వారా చర్యలు తీసుకుంటుందన్నారు.

'అనంత'లో ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి-అనంతపురం

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని అనంతపురంలో ట్రాఫిక్‌ను మళ్లించినట్లు డీఎస్పీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి 30వతేదీ రాత్రి 12 గంటల వరకూ ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయన్నారు. ఆయా తేదీల్లో కళ్యాణదుర్గం, బళ్లారి వైపు నుంచి ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు నగరంలోకి వచ్చే క్రమంలో సుభాష్ రోడ్డు, రాజు రోడ్డు మీదుగా శ్రీకంఠం వైపు నుంచి ఆర్టీసీ బస్టాండుకు చేరాలని సూచించారు. అలాగే తాడిపత్రి నుంచి వచ్చే వాహనాలు ఎన్టీఆర్ మార్గ్, చెరువు కట్ట, కలెక్టరేట్ మీదుగా వెళ్లాలన్నారు. ఆయా ట్రాఫిక్ ఆంక్షలను వాహనదారులు సహకరించాలని కోరారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నేడు కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాస్థాయి అధికారులందరూ హాజరవుతారని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిస్కారం కోసం వచ్చి అర్జీ ఇచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హామీలు నెరవేర్చండి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అధికారంలోకి రాకముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. ఆదివారం గణేనాయక్ భవన్‌లో సిపిఎం నగర కమిటీ సభ్యులు మసూద్ అధ్యక్షతన నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి అధికారంలోకి రాకముందు నగరంలో నివసిస్తున్న వారికి రెండు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చి, గృహాలు నిర్మిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అర్హులైన వారందరికీ పింఛన్లు, రేషన్ కార్డులు ఇస్తామని ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల్లో 50 ఏళ్లు నిండిన వారందరికీ పింఛన్లు ఇస్తామని చెప్పిందని అన్నారు. అయితే అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్న ఒక్కరికి కూడా కొత్త పింఛను ఇచ్చిన పాపాన పోలేదని విమర్శించారు. నగరంలో నివసిస్తున్న పేదలకు రెండు సెంట్లు స్థలం ఇవ్వకపోగా పేదలు వేసుకున్న గుడిసెలకు ఇంటి పట్టాలు కూడా ఇవ్వడం లేదన్నారు. హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అధికారంలోకి రాకముందు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం టిడ్కో ఇళ్లను పట్టించుకోలేదని, టిడిపి కూటమి ప్రభుత్వాన్ని గెలిపిస్తే టిడ్కో ఇళ్లను పూర్తి చేసి అర్హులైన వారందరికీ ఇస్తామని హామీ ఇచ్చారని ఇంత వరకు వాటిని ఇవ్వలేదని అన్నారు. సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ అనంతపురం నగరంలో దుమ్ము, దూళి కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోందని, ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని అన్నారు. ఢిల్లీ నగరంలో ఉన్న కాలుష్యానికి తీసిపోని విధంగా అనంతపురం నగరంలో కాలుష్యం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలో ఉన్న డంపింగ్ యార్డ్‌ను తొలగించడంలో పాలకులు మాటలు నీటిమూటలయ్యాయన్నారు. డపింగ్‌యార్డ్ విషయంలో సిపిఎం ఆందోళన చేయడంతో ఎమ్మెల్యే స్పందిస్తూ అక్టోబర్ 2వ తేదీ నాటికి డంపింగ్ యార్డ్‌ను అక్కడి నుంచి పూర్తిగా తొలగిస్తామని హామీ ఇచ్చి నాలుగు నెలలు అవుతోందన్నారు. ప్రజల సొమ్ము ఖర్చు అవుతోందే తప్ప పని జరగడం లేదన్నారు. డంపింగ్ యార్డ్ పాలకులకు, అధికారులకు ఒక కామధేనువులాగా మారిందని విమర్శించారు. డంపింగ్ యార్డ్‌ను తొలగించేంత వరకు సిపిఎం పోరాడుతుందన్నారు. అనంతపురం నగరంలో కాలుష్యం నివారించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల రంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, ముత్తుజా, సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్, మసూద్, ఇర్ఫాన్, గోపాల్, నగర కమిటీ సభ్యులు ఓబులేసు, లక్ష్మీనారాయణ, ఎర్రి స్వామి, లక్ష్మీనరసమ్మ, అశ్విని, ఎన్టీఆర్ సీన, లతీఫ్, వెంకట, గఫూరు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుది అవకాశవాద రాజకీయం

మాజీమంత్రి సాకే శైలజనాథ్

ప్రజాశక్తి-అనంతపురం

ముఖ్యమంత్రి చంద్రబాబుది పచ్చి అవకాశవాద రాజకీయ నాయకుడు అని మాజీమంత్రి, శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ విమర్శించారు. ఆదివారం అనంతపురంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎప్పుడు ఏ సమస్య వచ్చినా, ప్రజల దృష్టి మరల్చేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఇందులో భాగంగానే ఇప్పుడు ఫ్లెక్సీలు, జంతుబలులు అంటూ అనవసర రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ఏనాడూ వైసిపి హింసను ప్రోత్సహించలేదన్నారు. నిజానికి ప్రస్తుతం టిడిపినే హింసను ప్రోత్సహిస్తోందని విమర్శించారు. ఫ్లెక్సీల వద్ద పొట్టేళ్లు బలి ఇచ్చారని, యువకులపై కేసు పెట్టిన పోలీసులు, వారిని హింసించి, తర్వాత నడిరోడ్డుపై నడిపించడం బాధాకరమన్నారు. ఆ స్థాయిలో హింసించేంత నేరం యువకులను ఏం చేశారని నిలదీశారు. గతంలో చంద్రబాబు, ఆయన బావమరిది, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఫ్లెక్సీల వద్ద వేర్వేరు సందర్భాల్లో పొట్టేళ్ల తల కొట్టి, ఆ రక్తంతో ఫ్లెక్సీలకు రక్తతర్పణం చేసింది గుర్తు లేదా.. ప్రశ్నించారు. ఈ సమావేశంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి శివకుమార్ నాయక్, యువ నాయకులు రిత్విక్, బోనాల హరికృష్ణ, దీపక్ పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న మాజీమంత్రి సాకే శైలజానాథ్

పార్టీ బలోపేతానికి సహకరించండి

ఎంపి, ఎమ్మెల్యేలను కలిసిన టిడిపి జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



టిడిపి జిల్లా అధ్యక్షులు పూల నాగరాజును సన్మానిస్తున్న ఎంపి, ఎమ్మెల్యే

జిల్లాలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసేందుకు సహకరించాలని ఎంపి, ఎమ్మెల్యేలను టీడీపీ అధ్యక్షులు పూల నాగరాజు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆదివారం జిల్లాకేంద్రంలో ఎంపితోపాటు ఎమ్మెల్యేలను వేర్వేరుగా పూల నాగరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా విప్ కాలవ శ్రీనివాసులును ఆయన నివాసంలో, అర్బన్ టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, క్యాంపు కార్యాలయాల్లో ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, ఆలూరులో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌ను వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపి, ఎమ్మెల్యేలు పూల నాగరాజును శుభాకాంక్షలు తెలిపి అభినందించి సత్కరించారు. తర్వాత నియోజకవర్గాల్లో ఉన్న పరిస్థితుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా పూల నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించే విధంగా పని చేద్దామన్నారు. తమ నియోజకవర్గంతో పాటు జిల్లాలో పార్టీ బలోపేతం కోసం తమవంతుగా కృషి చేస్తామని జిల్లా అధ్యక్షుడికి ఎమ్మెల్యేలు, ఎంపి తెలిపారు. నాయకులను కలిసిన వారిలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణకుమార్, జిల్లా మీడియా కోఆర్డినేటర్ దబ్బర కుమార్‌స్వామి నాయుడు, తదితరులు ఉన్నారు.

నవ్వులు విరబూయించిన హాస్యప్రియులు

శ్రీధర్‌ను సన్మానిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఒత్తిడి నిండిన సమాజానికి నవ్వులు దివ్యమైన ఔషధమని పలువురు వక్తలు అన్నారు. యోగాకేంద్రం అధ్యక్షులు ఎం.రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం స్థానిక వివేకానంద యోగాభవన్‌లో హాస్యభారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్యభారతి నిర్వాహకులు రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి రెండో శనివారంతో పాటూ వివిధ ప్రత్యేక సందర్భాల్లో హాస్యభారతి జరుగుతుందన్నారు. అంతకు ముందు సాయిప్రసాద్, రమేష్‌బాబు, ముత్యాలరెడ్డి, తులసీదాసు తదితరులు కడుపుబ్బా నవ్వించారు. అనంతరం దశాబ్దాలుగా అందరినీ నవ్విస్తున్న శ్రీధర్‌ను హాస్యభారతి పురస్కారం అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవతా కోకన్వీనర్ సలీం మాలిక్, జనప్రియ కవి ఏలూరి యంగన్న, ద్విబాషా కవి జూటు షరీఫ్, సుధాకరమూర్తి, రియాజుద్దీన్, తెలుగు భాషా వికాస ఉద్యమ నాయకులు జాగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, యోగా కేంద్రం ప్రతినిధి దివాకర్, రచయితలు జీఎల్ఎన్ ప్రసాద్, టీవీ.రెడ్డి, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

తేజ జూనియర్ కళాశాలలో తేజోత్సవం

విజయ సంకేతం చూపుతున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని తేజ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలోల భాగంగా ఆదివారం తేజోత్సవ్-2025 కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకలను ఎఎస్పీ మల్లికార్జునవర్మ, ఎసిబి డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, సిఐ ప్రతాప్ రెడ్డి, ఎస్ఐ రాంబాబు, చిన్నారి ఆసుపత్రి, అబ్బా టివి అధినేత డాక్టర్ హరిప్రసాద్, హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నరసింహప్రసాద్, బిఎస్ఎన్ఎల్ మాజీ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి, సిఆర్ఐటి విద్యాసంస్థల అధినేత చిర ంజీవిరెడ్డి, ఆర్డీటీ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు సాంస్కృతిక, క్రీడా రంగాల్లో ప్రతిభను ప్రదర్శించి నప్పుడే సమగ్ర వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుంద న్నారు. నేటి పోటీ ప్రపంచంలో క్రమశిక్షణ, కృషి, విలువలు విద్యార్థులకు అత్యంత అవసరమన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు, దేశభక్తి గీతాలు, సామాజిక సందేశాత్మక నాటికలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం విద్య, క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో తేజ జూనియర్ కళాశాల డైరెక్టర్ తేజేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

2వతేదీ నుంచి నాలుగో విడత భూ రీసర్వే

రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ డి.ప్రసాద్

ప్రజాశక్తి-కూడేరు

జనవరి 2వతేదీ నుంచి మండలంలో నాలుగో విడత భూ రీసర్వే నిర్వహించనున్నట్లు రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ డి.ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని కమ్మూరు, గోట్కూరు, మరుట్ల గ్రామాల రెవెన్యూ పరిధిలో రీ సర్వే ఉంటుందన్నారు. ఆయా గ్రామాల రైతులకు రెండు రోజుల ముందే రీసర్వేకు సంబంధించి నోటీసులు అందజేస్తామన్నారు. 29న ఉదయం గోట్కూరు, మధ్యాహ్నం కమ్మూరు, 30న ఉదయం మరుట్ల గ్రామాల్లో గ్రామసభలు ఉంటాయన్నారు. ఆయా సభలకు రైతులు తప్పనిసరిగా హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు. రీ సర్వేకు వచ్చినప్పుడు సంబంధిత భూముల రైతులు తప్పనిసరిగా భూముల వద్దకు రావాలన్నారు. అంతేగాకుండా భూములకు సంబంధించిన అన్ని రికార్డులను సంబంధిత అధికారులకు అందజేయాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకాల నకలు, అసైన్మెంట్ డి.పట్టా నకలు, భూమికి సంబంధించి ఏవైనా రిజిస్టర్ డాక్యుమెంట్ల నకులు, రైతు ఫొటో, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్, కులం వివరాలు, ఒకవేళ భూమి చుక్కల భూమి అయ్యి ఉంటే గతంలో ఎన్‌ఓసి వచ్చి ఉంటే వాటి నకలు, ఎన్‌ఓసి రాకుంటే ఆర్‌హెచ్ కాఫీ, ఇసి 1956 నుంచి 2025, రిజిస్టర్ డాక్యుమెంట్ల నకలు వంటి పత్రాలను అధికారులకు అందజేయాలన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్నేహ బంధాలు రోజురోజుకీ బలహీనమవుతున్న ప్రస్తుత తరుణంలో నాలుగు దశాబ్దాల పూర్వపు విద్యార్థుల ఆత్మీయ కలయిక ఎంతగానో ఆనంద భరితంగా నిలిచింది. జిల్లాలోని గుంతకల్లులో ఉన్న ఎస్‌జెపి హైస్కూల్‌లో 1986-87లో బ్యాచ్.ఏ సెక్షన్ విద్యార్థులు ఆదివారం ఉదయం స్థానిక ఎపి ఎన్‌జిఒ సమావేశ మందిరంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో పాటు కొత్త స్నేహితుల పరిచయ వాతావరణం నెలకొంది. అనంతరం వక్తలు మాట్లాడుతూ ఇలాంటి ఆత్మీయ కలయికల వల్ల ఐక్యత ఏర్పడుతుందన్నారు. అంతేగాకుండా హృదయ పూర్వక ఆనందభరిత, మధుర జ్ఞాపకాలను ఒకరికొకరు పంచుకునే అవకాశం ఉంటుందన్నారు.

సుమారు 40 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై అందరూ చేరుకుని యోగక్షేమాలు పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రియాజ్ బాషా, దాదా ఖలందర్, మహమ్మద్ యాసీన్, నబిరసూల్, నిర్మలరెడ్డి, లోకేశ్వరీదేవి, సూరయ్య బేగం, జయభారతి, అరుణాదేవి, వేణు, చంద్రశేఖర్, అన్వర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడిన కార్యకర్తలకు న్యాయం చేస్తాం

గుమ్మనూరు ఈశ్వర్

ప్రజాశక్తి-పామిడి

పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు, పామిడి, గుత్తి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ తెలిపారు. ఈమేరకు ఆదివారం మండలంలోని జి.కొట్టాల గ్రామంలో రూ.26లక్షల ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో నూతన సిసి రోడ్లు, పాల్యం తండాలో రూ.30 లక్షలతో డ్రెయినేజీలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో వచ్చిన పనులు చేసేందుకు పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకే అప్పగిస్తున్నట్లు తెలిపారు.

కార్యకర్తలు బాగుండాలనే ఉద్దేశంతోనే ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా స్వచ్ఛందంగా పనులు అప్పగించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ తేజోష్ణ, పిఆర్ జెఇ హేమ్లానాయక్, పామిడి మండల, పట్టణ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగులకు రిటైర్డ్‌మెంట్ తప్పనిసరి

మాజీ ఎమ్మెల్యే కె.మధుసూదన్‌గుప్తా

ఆమూరు శ్రీనివాసులు దంపతులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కె.మధుసూదన్‌గుప్తా

ప్రజాశక్తి-గుత్తి

ప్రతి ప్రభుత్వ ఉద్యోగికీ తన జీవితంలో బదిలీ, పదోన్నతి, ఉద్యోగ విరమణ తప్పనిసరి అని మాజీ ఎమ్మెల్యే కె.మధుసూదన్‌గుప్తా అన్నారు. ఆదివారం గుత్తి ఆర్ఎస్‌లోని రైల్వే ఇన్సిట్యూట్‌లో రైల్వే సీనియర్ ఉద్యోగి (లోకో పైలట్) ఆమూరు శ్రీనివాసులు ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రైల్వే ఉద్యోగి శ్రీనివాసులు నిబద్ధతతో పని చేసి మంచి పేరు సంపాదించారన్నారు. పదవీ విరమణ అనంతరం శేష జీవితాన్ని సంతోషంగా గడపాలన్నారు. కార్యక్రమంలో రైల్వే ఉద్యోగులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షుడిని కలిసిన 'దేగల'

పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షుడితో దేగల కృష్ణమూర్తి

ప్రజాశక్తి-శింగనమల

పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కలిశెట్టి అప్పలనాయుడును విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయంలో పంచాయతీ రాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా శింగనమల నియోజకవర్గ టిడిపిలో నెలకొన్న సమస్యలపై చర్చించారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ-కూలీలతో కలిసి వరినాట్లు వేసిన ఎమ్మెల్యే

వరినాట్లు వేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల

రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వ కృషి చేస్తోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని శింగనమల చెరువు కింద ఉన్న వరిపొలాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఇందులో భాగంగా రైతులు, కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వరినాట్లు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 'రైతే రాజు.. రైతు బాగుంటేనే కూలీలు.. ప్రజలు బాగుంటారు..' అన్నారు. దేశానికే వెన్నెముక లాంటి రైతన్నలను ఆదుకునేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అనంతరం శింగనమల చెరువు నుంచి ప్రతి సంవత్సరం ఒక పంటకు నీరు ఇవ్వాలని రైతులు, కూలీలు కోరగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ దండు శ్రీనివాసులు, ఎంపిడిఒ భాస్కర్, అగ్రికల్చర్ ఎఒ అన్వేష్‌కుమార్, ఇఒఆర్‌డి విజయ్‌కుమార్, టిడిపి మండల కన్వీనర్ గోరంట్ల మారుతీనాయుడు, శింగనమల చెరువు ఆయకట్టు ప్రెసిడెంట్ జి.సత్యనారాయణ, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి అనిల్‌కుమార్ యాదవ్, నాయీబ్రాహ్మణుల రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఆదినారాయణ, చిన్న జలాలపురం సుధాకర్, రాగే పరశు రాముడు, దాసరి గంగాధర్, కాయల రమణయాదవ్, బండి పరశురాముడు, జడేజా, ముంతా వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి తిప్పేస్వామి, విఆర్ఒ తాతయ్య, సచివాలయ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో 'స్వచ్ఛాంధ్ర' సాధ్యం

ప్రజలందరి భాగస్వామ్యతంతోనే స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛాంధ్ర సాధ్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. మండల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే మండల కేంద్రంలోని ప్రధాన రహదారులు, డ్రైనేజీ కాలువలను పరిశీలించారు. డ్రెయినేజీల్లో మద్యం సీసాలు, ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్, తదితర వ్యర్థాలు నిండి, దుర్గంధమయంగా ఉండటాన్ని గమనించారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ డ్రెయినేజీలు, పరిసర ప్రాంతాలు పరిశుభ్రతగా ఉండేందుకు ప్రజలు కూడా సహకరించాలన్నారు. డ్రెయినేజీలో ఘన పదార్థాలు, ప్యాకెట్లు, ఆకు కూరల పుల్లలు, తదితర చెత్తను వేయకుండా చెత్త సేకరణ వాహనం వచ్చినప్పుడు చెత్తను అందజేయాలని కోరారు. అలాగే కిరాణా, టిఫిన్ సెంటర్లు, ఇతర దుకాణాల వద్దకు నేరుగా ఎమ్మెల్యే వెళ్లి తప్పనిసరిగా డస్ట్ బిన్‌లు వాడాలని సూచించారు.

ప్రతి ఒక్కరికీ విద్య, వైద్యం అందించడమే లక్ష్యం

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలోని ప్రతి పేదవాడికీ విద్య, వైద్యం అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఈమేరకు ఆదివారం నగరంలోని అర్బన్ టిడిపి కార్యాలయంలో 22వ విడత కింద 31 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.21లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేనివిధంగా అర్బన్ నియోజకవర్గంలో సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఏడాదిన్నరలోనే 400 మందికి రూ.4 కోట్ల మేర సిఎంఆర్ఎఫ్ కింద సాయం అందించిన్నారు. ఇందులో మైనార్టీలకు అత్యధిక శాతం సాయం చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో ఏ ఒక్కరూ వైద్యం అందలేదన్న అభిప్రాయం ఉండకూడదన్నారు. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన తొలినెలలోనే ఐదు కీలక హామీలు నెరవేర్చినట్లు చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతిహామీని నెరవేర్చడంతో పాటు గతంలో ఎప్పుడూ లేనివిధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. ముఖ్యంగా రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగుల కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ఒక్క కియా స్థాపనతోనే దాదాపు 50వేల మంది కుటుంబాలకు ఉపాధి కలుగుతోందన్నారు. రానున్న రోజుల్లో జిల్లాకు మరిన్ని పరిశ్రమలు వస్తాయన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఇప్పటికే రూ.120కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. ప్రతి కాలనీలో రోడ్లు, డ్రెయినేజీలు, ఇతర మౌలిక వసతులు కల్పించాలన్న ఉద్దేశంతో రోజూ సుమారు రూ.50లక్షలతో పనులు ప్రారంభిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పిఎల్ఎన్ మూర్తి, పరమేశ్వర్, కార్పొరేటర్లు జనబలం బాబా, బాలాంజనేయులు, మాజీ కార్పొరేటర్లు సరిపూటి రమణ, రాజారావు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు తొండపునాటి రమేష్, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్‌అహ్మద్, టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయి వెంకటనారాయణ, టిడిపి నాయకులు కాయగూరల శ్రీధర్, కేశవ నాయుడు, గోపాల్ గౌడ్, నెట్టెం బాలకృష్ణ, ఓంకార్‌రెడ్డి, వన్నూరప్ప, గోళ్ల సుధాకర్‌నాయుడు, బోయ నాగరాజు, కృష్ణం రఘు, ఇమ్రాన్, తాటి మధు, ఇస్మాయిల్, వడ్డే వెంకటేష్, బెస్త అంజి, దాదా ఖలందర్, ముస్తాక్, మహమ్మద్ రఫీ, జయరామ్‌నాయక్, మహిళా నాయకులు చరిత, సరోజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.పాతిరెడ్డి

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.పాతిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎపిటిఎఫ్) రాష్ట్ర కార్యదర్శి జి.పాతిరెడ్డి, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, ఎస్.సిరాజుద్దీన్, రాష్ట్ర పూర్వపు కార్యదర్శి బి.నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించిన ఎపిటిఎఫ్ సబ్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి తక్షణమే మినహాయింపు ఇవ్వాలన్నారు. పదో తరగతి వంద రోజుల శిక్షణ కార్యక్రమం ఉపాధ్యాయులకు విద్యార్థులకు మానసిక వేదనకు గురిచేసేలా ఉందన్నారు. ఒక్కరోజు కూడా పబ్లిక్ హాలిడేస్‌లో కూడా నిర్వహిస్తుండం విద్యార్థులకు యాంత్రికంగా మానసిక ఒత్తిడిని కలుగజేస్తుందన్నారు. ఉపాధ్యాయులకు తమ అనారోగ్య పరిస్థితులను వ్యక్తిగత పనులను చేసుకోవడానికి వీలు లేకుండా నిర్వహించడం తగదన్నారు. తక్షణమే వంద రోజుల శిక్షణ కార్యక్రమం పబ్లిక్ హాలిడేస్ నుంచి మినహాయించాలన్నారు. గత సంవత్సరం వంద రోజుల శిక్షణా కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులకు ఇంత వరకు సిసిఎల్ ఇవ్వలేదని తక్షణమే మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పెండిగ్ సమస్యలు 12వ పిఆర్‌సి నియామకం, మధ్యంతర భృతి, బకాయి డిఎలను తక్షణమే ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా సబ్ కమిటీ సభ్యులు డేనియల్ నాగరాజు, మోహన్‌రెడ్డి, బొమ్మయ్య, రామాంజినేయులు, నరేష్ కుమార్, సతీష్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు సర్దార్ వలి, లక్ష్మిప్రసాద్, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిన టిడిపి మైనార్టీ నేత

వైసిపిలోకి చేరిన వారితో జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

టిడిపి నగర ప్రధాన కార్యదర్శి ముక్తియార్ ఆదివారం వైసిపిలో చేరారు. ఈమేరకు ముక్తియార్‌తోపాటు అనుచరులకు వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి వైసిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైసిపిలో పనిచేయడానికి ముక్తియార్, ఆయన అనుచరులు రావడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలల కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా అరాచక పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. పోలీసులను అడ్డు పెట్టుకుని వైసీపీ శ్రేణులపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. జిల్లా కేంద్రం నుంచి అన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొందన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వైసిపి నాయకులు, కార్యకర్తలను లొంగతీసుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మరోవైపు ఇంటి గొడవల్లోకి కూడా తలదూర్చి పోలీసులతో పంచాయితీలు చేయడం బాధాకరమన్నారు. ముఖ్యంగా జిల్లాకేంద్రంలో అమాయక ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. టిడిపి నాయకులే అనంతపురంలో ఆస్తులు కాజేస్తున్నారని ఆరోపించారు. సాక్షాత్తూ టీడీపీ నాయకులే బహిరంగంగా అధికార పార్టీ దౌర్జన్యాలను ప్రశ్నిస్తున్నారని గుర్తు చెశారు. తాడిపత్రి, ఉరవకొండ, రాయదుర్గం, రాప్తాడు వంటి ప్రాంతాల్లో అధికార పార్టీ నేతలు పోలీసులను అడ్డుపెట్టుకుని దౌర్జన్యాలు కొనసాగిస్తున్నారని విమర్శించారు. అనంతపురంలో ఇంటి పెద్దలు ఎవరైనా చనిపోతే వాళ్ల ఆస్తులపై కన్నేసి అధికార పార్టీ నేతలు కాజేస్తున్నారన్నారు. టిడిపి దౌర్జన్యాలను డైవర్ట్ చేయడానికే గుల్జార్‌పేటలో టీడీపీ దిమ్మె తొలగింపు పేరుతో వైసీపీ నాయకుడిని అరెస్టు చేశారని ఆరోపించారు. త్వరలోనే అధికార పార్టీ నాయకులకు ప్రజలే బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

గుండె పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-శెట్టూరు

దుర్గం ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కిమ్స్ సవేరా ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం స్థానిక ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా దాదాపు 150 మంది రోగులకు జిఆర్‌బిసి, బిపి, షుగర్, ఇసిజి, 2డి ఎకో లాంటి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్టు ఫౌండర్ లయన్ కంబాల తిమ్మారెడ్డి మాట్లాడుతూ వివిధ రకాల రోగాలతో బాధపడుతున్న వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు తగిన సలహాలు, సూచనలు అందించినట్లు తెలిపారు. ఓంశాంతి సెంటర్ ఇన్‌ఛార్జి బికె కమలాక్షి మాట్లాడుతూ తమ సెంటర్‌లో యోగా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. డాక్టర్ నితీష్ మాట్లాడుతూ తమ ఆసుపత్రి ద్వారా నిర్వహించే ఉచిత సేవా కార్యక్రమాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చాందిని, కురుబ రాము, మేడా ప్రభాకర్, ఓంశాంతి సెంటర్ నిర్వాహకులు, కిమ్స్ సవేరా ఆసుపత్రి వైద్యులు, టెక్నీషియన్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు పనుల పర్యవేక్షణ

ప్రజాశక్తి-యాడికి

మండల కేంద్రంలోని పలు కాలనీల్లో చేపట్టిన అభివృద్ధి పనులను టిడిపి నాయకులు ఆదివారం పర్యవేక్షించారు. గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మండలంలో పర్యటించిన జెసి అస్మిత్‌రెడ్డికి చెన్నకేశవ స్వామి కాలనీలో కల్వర్టు నిర్మించాలని స్థానికులు విన్నవించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కాలనీవాసుల వినతి మేరకు చెన్నకేశవ స్వామి కాలనీలో కల్వర్టు పనులను ప్రారంభించారు. ఆయా కల్వర్టు పనులను టిడిపి నాయకులు పర్యవేక్షించారు. ఆయా పనులను పరిశీలించిన వారితో టిడిపి పట్టణ అధ్యక్షులు వెలిగండ్ల ఆదినారాయణ, బీసీ సెల్ మండల అధ్యక్షులు తిరంపురం నీలకంఠ, కరెంట్ రహంతుల్లా, వెనిగండ్ల ఉపేంద్ర, ఫైబర్ చందు, సెల్ పాయింట్ చాంద్‌బాషా, కోటవీధి షేక్షా, తదితరులు ఉన్నారు.

కోట ముఖద్వారానికి రాళ్ల తరలింపు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని కోట ముఖద్వారం జీర్ణోద్ధరణకు అవసరమైన రాళ్లను కేంద్ర పురావస్తు శాఖ అధికారులు తరలించారు. ముఖద్వారం నిర్మాణానికి అవసరమైన రాళ్లను పల్లేపల్లి సమీపంలోని గ్రానైట్ క్వారీ వద్ద కత్తిరించారు. వాటిని బిటి ప్రాజెక్టు రోడ్డు వద్ద ఉన్న ఖాళీ స్థలంలో నిర్మాణానికి అనుకూలంగా సిద్ధం చేసి ముఖద్వారం వద్దకు తరలించారు. నిర్మాణానికి అవసరమైనన్ని రాళ్లు సిద్ధం చేసిన వెంటనే నిర్మాణం పనులు మొదలు పెడతామని కేంద్ర పురావస్తు శాఖ అధికారులు తెలిపారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-గుత్తి

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ జి.పుణ్యవతి, ఉప తహశీల్దార్ ఎంకె.సూర్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భూములకు సంబంధించి మ్యుటేషన్, రికార్డ్ ఆఫ్ రైట్స్, ఎఫ్ లైన్, సబ్ డివిజన్ తదితర సమస్యలను సమస్యల పరిష్కార వేదికలో పరిష్కరించనున్నట్లు చెప్పారు.

మార్కెట్ సంతల ఆదాయం రూ.3,42,700

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక మార్కెట్ యార్డులో ఆదివారం నిర్వహించిన పశువుల సంత నుంచి రూ.3,42,700 వరకూ ఆదాయం వచ్చినట్లు మార్కెట్ యార్డు కార్యదర్శి రాఘవేంద్ర కుమార్, సూపర్‌వైజర్ కిషోర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గొర్రెలు, మేకల నుంచి రెండు లక్షల నాలుగు వేల వంద, పశువుల సంత నుంచి రూ.1,38,600 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

తారు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండలం పరిధిలోని రేగడికొత్తూరు నుంచి నీలంపల్లి గ్రామం వరకూ నూతనంగా నిర్మించనున్న బిటి రోడ్డుకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదివారం భూమిపూజ చేశారు. ఉపాధి హామీ పథకం నిధులు రూ.49.5 లక్షలతో తారు రోడ్డు వేయనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇందులో భాగగానే నియోజకవర్గ వ్యాప్తంగా ఉపాధి హామీ నిధులు రూ.3కోట్లతో బిటి రోడ్లు, రూ.4.28 కోట్లతో సీసీ రోడ్లు వేయనున్నట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించారన్నారు. దీంతో గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉండిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి అభివృద్ధిని గాడిన పెట్టినట్లు వివరించారు.

అనంతపురంలో శంబాల చిత్రబృందం సందడి

ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు. చిత్ర బృందం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురంలో శంబాల చిత్రబృందం సందడి చేసింది. ఈ సందర్భంగా సినీనటుడు సాయికుమార్, హీరో ఆది, హీరోయిన్ అర్చనఅయ్యర్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ఆధ్వర్యంలో అనంతపురంలోని మాసినేని గ్రాండ్ హోటల్ నుంచి త్రివేణి థియేటర్ వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం థియేటర్‌లో అభిమానులతో చిత్రబృదం సందడి చేసింది. అనంతరం చిత్రబృందాన్ని సన్మానించారు. శంబాలా చిత్రాన్ని ఇంత మంచి విజయం అందించినందుకు ప్రేక్షకులకు కతజ్ఞతలు తెలిపారు. మరిన్ని మంచి చిత్రాలతో ముందుకు వస్తామని ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. ఈనెల 25న విడుదలైన స్తంభాల చిత్రం ఇప్పటి వరకూ అన్ని థియేటర్లు ప్రేక్షకులతో కలకలలాడుతుండటం సంతోషంగా ఉందన్నారు.

టిడిపి జిల్లా అధ్యక్షుడిని కలిసిన మాజీ జెడ్పీటీసీ

ప్రజాశక్తి-శింగనమల

ఇటీవల నూతనంగా నియమితులైన టిడిపి జిల్లా అధ్యక్షులు పూల నాగరాజుతోపాటు జిల్లా ప్రధాన కార్యదర్శి కదరకుంట శ్రీధర్‌చౌదరిని ఆదివారం నగరంలోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో మాజీ జడ్పిటిసి శాలిని, చిదంబరి దొర మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకేలు అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా శింగనమల మండలంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు.

'ఆటా' పురస్కారం అందుకున్న హరినాథరెడ్డి

అవార్డు అందుకుంటున్న హరినాథరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

తెలుగు భాషా సాహిత్యరంగాల్లో అనంతపురం కేంద్రంగా అప్పిరెడ్డి హరినాథరెడ్డి అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) అందించే ఆటా ఎక్సెలెన్స్ అవార్డును శనివారం సాయంత్రం హైదారాబాద్‌లోని రవీంద్ర భారతిలో అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆటా అధ్యక్షులు చల్లా జయంత్, బోర్డు మెంబర్స్ సతీష్ రెడ్డి, ముదిరెడ్డి , శ్రీకాంత్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం

అనంతపురం : నగరంలోని 40 డివిజన్ 58వ సచివాలయం పరిధిలో బదిలీపై వెళ్లిన ఉద్యోగులను స్థానిక టిడిపి నాయకులు డాక్టర్ నలుబోలు మధురాయల్ ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ టిడిపి నాయకులు మహబూబ్ ఖాన్, సలీం, ఇనయతుల్లా, కిరణ్‌కుమార్‌రెడ్డి, రమణ, జయరాము, బాషా, కుద్దూస్ రఫీ, చికెన్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో మోటార్ మెకానిక్ మృతి

బుక్కరాయసముద్రం : విద్యుదాఘాతంతో మోటార్ మెకానిక్ మృతిచెందిన ఘటన మండలంలోని కొర్రపాడు గ్రామంలో చోటు చేసుకుంది. బుక్కరాయసముద్రం పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని రెడ్డిపల్లికి చెందిన పుల్లయ్య, లక్ష్మీదేవి కుమారుడు వేణు (25) మోటార్ మెకానిక్‌గా పని చేసేవాడు. ఇందులో భాగంగానే ఆదివారం సమీపంలోని కొర్రపాడు గ్రామంలో ఓ రైతు మోటారు కాలిపోవడంతో మర్మతులు చేసేందుకు ట్రాక్టర్ ఇంజన్‌తో వెళ్లాడు. ఇందులో భాగంగా మోటార్‌కు మరమ్మతులు చేస్తుండగా పైన ఉన్న విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. తర్వాత మృతదేహాన్ని పోస్టుమార్ట నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.